


"మనిషి పుట్టిన వాడు కారాదు మట్టిబొమ్మ... పట్టుదలే ఉంటే కాగలడు మరో బ్రహ్మ... కృషి ఉంటే మనుషులు రుషులౌతారు.. మహాపురుషులౌతారు.. తరతరాలకు తరగని వెలుగౌతారు... ఇలవేలుపులౌతారు.." అని రాసిన ఈ అద్భుత గేయాన్ని తన నిజ జీవితంలో అక్షరాలా నిజం చేసిన ఓ ధీశాలి వాస్తవ కథ ఇది... పేదవానిగా పుట్టడం మన తప్పుకాదు... కానీ పేదవానిగానే చచ్చిపోతే మాత్రం అది నిజంగా మన తప్పేనన్న మాటను ఆయన బలంగా విశ్వసి స్తారు. ఒకప్పుడు కడుపు నిండా అన్నం లేకుండా.. కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడ్డ ఆయనే నేడు వందలాది మంది నిరుపేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తూ.. వారి జీవితాలకు కల్పతరువులా మారారంటే అతిశయోక్తి కాదు. కాలం కాటేయడంతో తన చిన్నప్పుడు తండ్రిని కోల్పోయి తన తల్లి పడుతున్న ఆర్థిక ఇబ్బందులను.. కష్టాలను కండ్లారా చూసి.. అనారోగ్యంతో తన తల్లిని సైతం కోల్పోయిన వ్యథను తలచుకుని ఎన్నోసార్లు మౌనంగా రోధించిన ఆయన.. తన తల్లిదండ్రులను దూరం చేసిన అనారోగ్యం మూలంగా మరే కుటుంబం కూడా కన్నీరు పెట్టుకోకూడదన్న ఆలోచన.. అకుంఠిత దీక్షతో చదివి వైద్యునిగా విజయతీరాలకు చేరారు.. నేడు సొంతంగా ఆస్పత్రిని స్థాపించి వందలాది మందికి వైద్య సదుపాయాలు అందిస్తూ అందరిచేతా ప్రశంసలు అందుకుంటున్నారు. ఆయనెవరో కాదు కొత్తగూడెం పట్టణంలోని గణేష్ టెంపుల్ దగ్గర నూతనంగా ప్రారంభించిన **విప్ర హాస్పటల్ అధినేత, ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపిచంద్.** అచంచల విశ్వాసంతో అంచలంచెలుగా ఎదిగి సమాజంలో అందరివాడిగా, అజాత శత్రువుగా తనకంటూ ఒక ప్రత్యేక చరిత్రను లిఖించుకున్నారు. డాక్టర్ గోపిచంద్ ప్రస్థానంపై కెరటం న్యూస్ ప్రత్యేక కథనం...

శామ్, సెప్టెంబర్14 (కెరటం ప్రతినిధి)

- ఊహ తెలియని వయసులోనే తండ్రిని కోల్పోయి.. కండ్ల ముందే తల్లిని పోగుట్టుకుని ఎన్నో కష్టాలు..
- తినడానికి తిండి లేక కాలే కడుపుతో కసిగా చదివి..అన్నింటా మెరుగే..
- తాను పడ్డ కష్టం మరొకరు పడకూడదనే వైద్య వృత్తికి..
- నిరుపేద కుటుంబం నుంచి ప్రజా వైద్యునిగా ప్రస్థానం...

# కష్టాల కొలిమిలో మెరిసిన విద్యా కుసుమం

# డా.గోపిచంద్

- మంచి వైద్యం అందించాలని 'విప్ర' ఆస్పత్రికి అంకురార్పణ
- భార్య సహకారంతో సమాజ సేవలో ముమ్మందుకు..
- విప్ర హాస్పటల్ అధినేత, ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపిచంద్ ప్రస్థానంపై కెరటం ప్రత్యేక కథనం..


## గ్రూప్ - 1 ఉద్యోగం వదిలి సమాజ సేవకు కదిలి..

**ఉసిరికాయలపల్లిలో మెరిసిన విద్యా కుసుమం..**

విప్ర హాస్పటల్ అధినేతగా ఎంతో మందికి అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తున్న డాక్టర్ గోపిచంద్ ప్రస్థానాన్ని పరిశీలిస్తే.. ప్రస్తుతం ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన మూడ్ లాల్‌సింగ్, భీమిని దంపతులకు ఇద్దరు సంతానంలో చిన్నవాడు గోపిచంద్. అక్క అరుణ. తండ్రి లాల్‌సింగ్ డాక్టర్ గోపిచంద్‌కు ఊహతెలియని వయస్సులోనే మరణించారు. దీంతో కుటుంబ భారమంతా తల్లి మీదనే పడగా, కుటంబ పరిస్థితి దయనీయంగా మారింది. పొద్దంతా కూలి పనులు, వ్యవసాయ పనులు చేసి



కుటుంబాన్ని పోషించింది. తినడానికి తిండికి కూడా లేక అనేక ఇబ్బందులు పడ్డారు. పిల్లలను ఎలాగైనా చదవించాలన్న ఆలోచనతో రెక్కలుముక్కలు చేసుకుని వచ్చిన సొమ్ముతో గోపిచంద్‌ను చదివించింది. తన తల్లి పడుతున్న కష్టాన్ని కండ్లారా చూసిన డాక్టర్ గోపిచంద్ మరెవ్వరికీ ఏ కష్టం రాకూడదని భావించారు. నాటి నుంచే ఎంతో కష్టపడి చదువుకుని అనారోగ్యంతో ఏ ఒక్క నిరుపేద కుటుంబం ఇబ్బందులు పడకూ డదని నిర్ణయిం చుకున్నారు. అలా డాక్టర్ గోపిచంద్ చిన్ననాటి నుంచి చదువులో మంచి ప్రతిభ కనబరిచేవారు. మొదటి నుంచి ఏడో తరగతి వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెన్నంగులగడ్డలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదివారు. అనంతరం పదో తరగతి వరకు ఉసిరికాయలపల్లిలోని శ్రీవికాస్ విద్యానికేతన్‌లో చదివి అత్యుత్తమ మార్కులు సాధించారు. పదో తరగతిలో వచ్చిన మార్కులను చూసిన ఇల్లందులోని సాహితి జూనియర్ కళాశాల యాజమాన్యం ఇంటర్ విద్యను పూర్తి ఉచితంగా చదువుకు నేందుకు అవకాశం ఇచ్చింది. అప్పుడు స్కూల్ ప్రిన్సిపల్ సురేష్ ప్రోత్సహించడంతో బైపిసిలో చేరి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం ఎం.బి.బి.ఎస్ సీటును ఈ.ఎన్.టి విభాగంలో గాంధీ మెడికల్ కళాశాలలో పొందారు. ఎం.బి.బి.ఎస్ మొదటి సంవత్సరంలో తల్లి భీమిని కూడా కిడ్నీ వ్యాధితో గాంధీ హాస్పటల్‌లోనే మరణించారు. దీంతో డాక్టర్ గోపిచంద్ పరిస్థితి మరింత దనీయంగా మారింది. కూలి పనులు చేసుకుని వచ్చిన డబ్బులతో కొడుకుని



చదివించుకుంటున్న తల్లి మరణించడంతో తినడానికి కూడా తిండి లేకుండా పస్తులుండేవారు. డాక్టర్ గోపిచంద్ పరిస్థితి గురించి పలు పత్రికల్లో రావడంతో కొంతమంది దాతలు ఆర్థికంగా సాయం అందించారు. అలా వారు అందించిన ఆర్థిక చేయూతతో ఎం.బి.బి.ఎస్‌ను పూర్తి చేశారు.ఎం.బి.బి.ఎస్ పూర్తయిన తర్వాత డాక్టర్ విజయలక్ష్మిని వివాహం చేసుకున్నారు. వీరికి షన్విత భీమినీ చౌహాన్, మన్వీత్ వీరభద్ర చౌహాన్ ఇద్దరు పిల్లలు ఉన్నారు.



నేను పడ్డ కష్టం మరొకరు పడకూడదు. చిన్ననాటి నుంచి కష్టం అంటే ఏమిటో కండ్లారా చూశాను. నేను అనుభవించిన బాధలు మరొకరు అనుభవించకూడదన్న ఆలోచనతో ఈ ఆస్పత్రిని స్థాపించాను. ఈ సమాజానికి ఎప్పటికీ రుణపడే ఉంటాను. నేను అన్ని ఇబ్బందులు పడినా సమాజంపై ఉన్న బాధ్యతతో వైద్య రంగంలో అడుగుపెట్టాను. మా ఆస్పత్రిలో ఆపద అంటూ వచ్చిన ప్రతి ఒక్క

## నేను పడ్డ కష్టం మరొకరు పడకూడదు..

నిరుపేదలకు మంచి ఆరోగ్యాన్ని తిరిగి ప్రసాదించాలన్నదే లక్ష్యం. సామాన్య ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలంటే హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు పరుగులు పెట్టాల్సిందే. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు లేకుండా అందరికీ అందుబాటులో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**డాక్టర్ గోపిచంద్,**
**విప్ర ఆస్పత్రి అధినేత**

### గ్రూప్-1 ఉద్యోగం వదిలి సమాజ సేవకు కదిలి...

ఎన్నో కష్టాలను అధిగమించి దాతల సాయంతో గాంధీలో ఈ.ఎన్.టి విభాగంలో ఎం.బి.బి.ఎస్ పూర్తి చేసిన డాక్టర్ గోపి చంద్‌కు కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేప థ్యం లో ఉద్యో గం చేశారు. ముంబైలో యూపిఎస్సీ రైల్వేలో గ్రూప్ -1 క్యాటగిరీలో కంబైన్డ్ మెడికల్ సర్వీస్‌లో రెండు సంవత్సరాల పాటు పనిచేశారు. ఈ క్రమంలో తనకు సాయపడ్డ సమాజానికి సేవ చేయాలన్న ఆలోచనతో తాను చేస్తున్న ఉద్యోగానికి సెలవు పెట్టి ఢిల్లీలోని ఎన్.ఎం.డి.సి మెడికల్ కళాశాలలో హిందురావ్ హాస్పటల్‌లో పిజిని జనరల్ మెడిసిన్ విభాగంలో చేశారు. అనంతరం ఫెలోషిప్ ఇన్ క్రిటికల్ కేర్ ఎడ్యూకేషన్ ఫౌం డేషన్ ఆఫ్ ఇండి యా, ఇంగ్లాం డ్‌లోని రాయ ల్ లైవ్ పూల్ అకాడ మీలో ఫెలోషిప్ ఇన్ డయా బెటిస్ మెల్లిటస్ చేశారు. జాబ్‌లో అయితే ఎక్కువ మందికి సేవ చేయలేమన్న ఆలోచనతో తాను చేస్తున్న గ్రూప్-1 ఉద్యోగాన్ని సైతం వదిలి ప్రస్తుతం కొత్తగూడెంలోని విప్ర ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు డాక్టర్ గోపిచంద్.





### డాక్టర్ గోపిచంద్‌కు వెన్నంటి నడిపిస్తున్న సతీమణి..

ఎం.బి.బి.ఎస్ పూర్తయి తర్వాత డాక్టర్ గోపిచంద్‌కు దూరపు చుట్టాలైన డాక్టర్ విజయలక్ష్మిని వివాహం చేసుకున్నారు. అటు భార్యగా ఇంటిని, పిల్లల్ని చూసుకుంటూనే... ఇటు భర్తకు తోడుగా ఉంటూ అన్నింటా చేయూతనిస్తున్నారు డాక్టర్ విజయలక్ష్మి. డాక్టర్ గోపిచంద్ చేయాలని ఆలోచన చేసిన ప్రతి పనిని ఆమె ప్రోత్సహిస్తూ.. ఆయనకు మనోధైర్యాన్ని కల్పిస్తోంది. బిఫార్మసీ, ఫార్మ్-డితో పాటు హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్‌లో ఎంబిఏ పూర్తి చేశారు డాక్టర్ విజయలక్ష్మి. ప్రస్తుతం డ్యూటీ మెడికల్ ఆఫీసర్‌గా, క్లినికల్ కేర్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. ఆస్పత్రిలో ప్రతి ఒక్క రోగిని కంటికి రెప్పలా కాపాడుతూ.. అటు ఆస్పత్రిని.. ఇటు కుటుంబాన్ని ఎంతో ఓర్పు.. నేర్పుతో నడిపిస్తూ... డాక్టర్ గోపిచంద్‌కు అన్నింటా బాసటగా నిలుస్తున్నారు ఆయన సతీమణి డాక్టర్ విజయలక్ష్మి.